క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ నియామకం

కోవూరు: కోవూరుకు సంబంధించి వైఎస్సార్‌ సీపీ మండల కమిటీని నియమిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ మండల ఉపాధ్యక్షులుగా షేక్‌.జుబేర్‌, బండి పద్మావతి, జనా వెంకటేశ్వర్లు గౌడ్‌, మారంరెడ్డి వినయ్‌కుమార్‌ రెడ్డి, యల్లబోయిన నాగరాజా, ప్రధాన కార్యదర్శులుగా అరుమెల్ల మొలకమ్మ, యర్రంరెడ్డి ఆదినారాయణరెడ్డి, మన్నేపల్లి నరసయ్య, అరుముల్ల వెంకటశేషయ్య, అల్లం నాగరాజ, కోశాధికారిగా రావి నాగార్జున చౌదరి, కార్యదర్శులుగా నావూరు శ్రీనివాసులు, మావులూరు వెంకటరమణారెడ్డి, బండ్ల నాగరాజు, గున్నం జనార్దన్‌, మన్నేపల్లి శరత్‌కుమార్‌, సభ్యులుగా గూడూరు హరిప్రసాద్‌రెడ్డి, మరుపూరు సురేంద్రరెడ్డి, సందీప్‌రెడ్డి, తలపల శ్రీను, మాదిరి హరికృష్ణ, గంపా జగన్నాథం, పమజుల సుబ్బరాయుడు, నూకలపాటి శ్రీనివాసులు నియమితులయ్యారు.

కసుమూరులో భక్తుల సందడి

వెంకటాచలం: మండలంలోని కసుమూరు దర్గా వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున దర్గాకు చేరుకోవడంతో పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుడికి అవార్డు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌: పట్టణంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గండికోట సుధీర్‌కుమార్‌ ఆదివారం సర్వేపల్లి రాధాకృష్ణన్‌ జాతీయ పురస్కారం అందుకున్నారు. గుంటూరులోని చలపతి ఇంజినీరింగ్‌ కళాశాలలో ప్రైవేట్‌ లెక్చరర్స్‌, టీచర్స్‌ ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మండల ఎంఈఓలు దిలీప్‌కుమార్‌, రత్నం ఆయనకు అభినందనలు తెలియజేశారు.

సీల్డ్‌ టెండర్లకు ఆహ్వానం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌: మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో సెప్టెంబర్‌ 22 నుంచి జరుగనున్న శరన్నవరాత్రులకు సంబంధించి పలు పనులకు ఈనెల 2న సీల్డ్‌ టెండర్లను ఆహ్వానిస్తున్నామని ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుద్దీపాలంకరణ, స్టేజ్‌, క్లాత్‌ పందిర్లు, బారికేడ్స్‌ ఏర్పాటుకు టెండర్లు వేసేవారు మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ఈఓ కార్యాలయంలో హాజరు కావాలని తెలియజేశారు.

చలో విజయవాడకు ఫ్యాప్టో మద్దతు

నెల్లూరు(టౌన్‌): సీపీఎస్‌ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సోమవారం ఏపీసీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో చేపట్టిన చలో విజయవాడకు ఫ్యాప్టో సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌ మధుసూదనరావు, జనరల్‌ సెక్రటరీ జావీద్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో మూడు లక్షల మందికిపైగా ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్‌ వల్ల ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. సామాజిక భద్రత లేక ఉద్యోగ విరమణ అనంతరం అతి తక్కువ పెన్షన్‌తో బాధపడుతూ మానసిక క్షోభ అనుభవిస్తున్నారన్నారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై చలో విజయవాడను జయప్రదం చేయాలన్నారు.

గణేష్‌ లడ్డూ వేలం



లడ్డూ దక్కించుకున్న సంతోషంలో..

నెల్లూరు సిటీ: రూరల్‌ మండలంలోని పడారుపల్లి శివాలయం వద్ద గణేష్‌ లడ్డూ వేలం వేయగా ఆదివారం నిర్వహించారు. రూ.1.35 లక్షలకు కాగుటూరు మస్తానయ్య వేలం దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మాచవోలు రమేష్‌, బాబూజీ, కార్తీక్‌, ప్రతాప్‌, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న కారు

ఉదయగిరి: బస్సును అతివేగంగా వస్తున్న కారు ఢీకొన్న ఘటన ఉదయగిరి–సీతారామపురం రోడ్డు మార్గంలో ఉదయగిరి జంక్షన్‌ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. సీతారామపురం నుంచి ఉదయగిరికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఉదయగిరి జంక్షన్‌ వద్దకు రాగానే నందిపాడు నుంచి నేలటూరు వెళుతున్న కారు అతి వేగంగా వచ్చి ముందుభాగంలో బలంగా ఢీకొంది. ఆర్టీసీ డ్రైవర్‌ అప్రమత్తమై బ్రేక్‌ వేయడం, కారులోని ఎయిర్‌బ్యాగ్స్‌ ఓపెన్‌ కావడంతో అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కారు ముందు భాగం బాగా పూర్తిగా దెబ్బతింది. ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అన్నదాత గుండెల్లో గుబులు

• మొదలైన వరికోతలు • కొనుగోలు కేంద్రాల్లేక దళారులకు అమ్ముతున్న వైనం

కోవూరు మండలానికి చెందిన వెంకట సుబ్బయ్య అనే రైతు ఒకటిన్నర ఎకరాలో వరి సాగు చేశాడు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడంతో సాగుకు భారీగానే ఖర్చు చేశాడు. ప్రస్తుతం ఎకరానికి మూడున్నర పుట్టి ధాన్యం వచ్చింది. అయితే దళారులు పుట్టికి రూ.16 వేలు కంటే ఎక్కువ ఇవ్వట్లేదు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.19,720లకు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. అయితే ఎక్కడా కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీనివల్ల తనకు భారీగా నష్టం వస్తోందని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



బుచ్చి మండలంలో ముంబై రహదారిపై ఉన్న ధాన్యం రాశులు



కోవూరులో వరి పంటను కోస్తున్న మెషీన్‌

కోవూరు/బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌: రెండో పంటకు నీరిచ్చాం అని పదేపదే ఊదరగొడుతున్న కూటమి ప్రభుత్వం ప్రస్తుతం వరికోతలు మొదలైనా రైతులను పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకు ప్రభుత్వపరంగా మద్దతు ధర ప్రకటించడం కానీ, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం కానీ చేయలేదు. ఈ పరిస్థితుల్లో అన్నదాత గుండెల్లో గుబులు మొదలైంది. కనీసం పెట్టుబడి ఖర్చులైనా వస్తాయా లేదా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు వాతావరణంలో మార్పులు రైతులను వణికిస్తున్నాయి. పంట చేతి కందే సమయంలో వర్షం కురిస్తే పంట మొత్తం నీటిపాలయ్యే అవకాశం ఉంది. దీంతో విధిలేని పరిస్థితుల్లో పంటను కోసి దళారులకు అమ్ముతున్నారు. దళారులు ఇదే అదనుగా భావించి రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. పుట్టి రూ.15 వేలు నుంచి రూ.16 వేలకే కొంటున్నారు.

లక్షల ఎకరాల్లో సాగు

జిల్లా వ్యాప్తంగా 1.98 లక్షల ఎకరాల్లో రైతులు ఎడగారులో వరిసాగు చేపట్టారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రూరల్‌ ప్రాంతాలు దామరమడుగు, జొన్నవాడ, కాగులపాడు, మునులపూడి, వవ్వేరు, మినగల్లు ప్రాంతాల్లో అధిక సంఖ్యలో వరిసాగు చేపట్టారు. దాదాపు మండలంలో తొమ్మిది వేల ఎకరాల్లో సాగు జరిగింది. 72 శాతం ఈ–క్రాప్‌ నమోదు చేపట్టారు.

ఎక్కడ చూసినా..

బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ప్రస్తుతం ముమ్మరంగా వరికోతలు జరుగుతున్నాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో కల్లాల్లోనే పంటను దళారులు చెప్పిన ధరకు అమ్మేస్తున్నారు. మండలంలో ముంబై రహదారిపై ఎక్కడ చూసినా వరిధాన్యం రాశులు, దళారుల హడావుడి, లారీలకు లోడు చేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులపై కక్ష తగదు



ప్రభుత్వం హామీ ఇస్తే నమ్మి రైతులు పంటలు వేశారు. కానీ ఇప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో అప్పులు తీరడం లేదు. రోజురోజుకూ వడ్డీలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం రైతులపై కక్ష సాధింపు చర్యలు తగదు.

– రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, రైతు సంఘం నాయకుడు

ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలి

కొనుగోలు కేంద్రాల విషయమై మండల వ్యవసాయాధికారిని వివరణ కోరగా... ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబర్‌ మొదటి వారంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అడగ్గా తమ చేతిలో ఏమీ లేదని ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

– శ్రీహరి, మండల వ్యవసాయాధికారి, బుచ్చిరెడ్డిపాళెం

అప్పుల బారిన పడిన రైతులు



రైతులు పంట మొదలు పెట్టినప్పుడు ఎరువులు, విత్తనాలు, మందులను కొనుగోలు చేయడానికి అప్పులు తెచ్చారు. గిట్టుబాటు ధర వస్తుందని నమ్మి పెట్టుబడులు పెట్టారు. కానీ ఇప్పుడు ఎకరా వరికోతకు వచ్చిన ధాన్యంపై రైతు పుట్టుకి దాదాపు రూ.3 వేల నష్టం వాటిల్లుతోంది.

– శివుని నరసింహులురెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు

గిట్టుబాటు ధరకు కొనాలి



ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు.

– నెల్లూరు శివారెడ్డి, రైతు, కోవూరు

వైభవంగా కల్యాణోత్సవం



పొదలకూరు: వినాయక చవితి వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి పట్టణంలోని రామనగర్‌గేటు సెంటరు విఘ్నేశ్వరుని విగ్రహం వద్ద శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

• పద్మావతి నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద యువకులు ఆదివారం ఉట్టి మహోత్సవం నిర్వహించారు. ఐదురోజులపాటు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. గ్రామోత్సవం ఏర్పాటు చేశారు.

సర్వేపల్లిలో అన్నదానం



వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా స్థానిక బజార్‌ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం జరిగింది. సాయంత్రం ఉట్టి మహోత్సవం పూర్తయిన తర్వాత నిమజ్జనం చేపట్టారు.

అడ్డదిడ్డంగా ఆటోలు



బస్టాండ్‌లో ఇలా..

పొదలకూరు: ఆటోలు పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయంగా మారాయి. కొందరు ఎక్కడపడితే అక్కడ రోడ్లపై నిలిపివేస్తుండడంతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. మెయిన్‌రోడ్డుపై ప్రయాణికులను ఎక్కించుకోవడం, దింపడంతో ఇరుకైన రోడ్లపై ట్రాఫిక్‌ స్తంభించిపోతోంది. అంతేకాక ప్రభుత్వ కార్యాలయాల గేట్ల ముందు కూడా నిలుపుతుండటంతో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ బస్టాండ్‌లోకి వెళ్లి దుకాణాల ముందు నిలపడం వల్ల వ్యాపారులకు ఆటంకంగా మారుతున్నట్టు చెబుతున్నారు.

రైలు స్టాపింగ్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాచలం: గూడూరు – విజయవాడ ఇంటర్‌ సిటీ ఎక్స్‌ప్రెస్‌ రైలు వెంకటాచలం రైల్వేస్టేషన్‌లో నిలిపేలా చొరవ చూపాలని మాజీ సర్పంచ్‌ వల్లెపు మునుస్వామి, బీజేపీ నాయకుడు అరుముళ్ల మురళి మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడిని కోరారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్‌ ట్రస్ట్‌లో ఆదివారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన కసుమూరు మస్తాన్‌వలీ దర్గా, భగవాన్‌ శ్రీవెంకయ్య స్వామి ఆశ్రమం మండలంలో ఉన్నందున గూడూరు – విజయవాడ ఆ రైలు ఇక్కడ ఆగితే ప్రయాణికులకు చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. మండలంలో బీఎస్‌ఎన్‌ఎల్‌ టవర్‌ సిగ్నల్స్‌ పని చేయడం లేదని విన్నవించడంతో వెంకయ్యనాయుడు సానుకూలంగా స్పందించారు.

గ్రామాల్లో ప్రచారం



చింతచెలికలో ప్రచారం చేస్తున్న సభ్యులు

కొడవలూరు: కృష్ణుని ఊరేగింపు ఆవశ్యకతను తెలియజేస్తూ త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని చింతచెలిక, తాటాకులదిన్నె, దాసరిపాళెం, మిక్కిలింపేట గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ వేదిక అధ్యక్షుడు డి.సురమౌళి మాట్లాడుతూ శ్రీకృష్ణుని ఊరేగింపు జరిగిన గ్రామాల్లో ప్రకృతి వైపరీత్యాలు, రోగాలు ఉండవన్నారు. ఆ వేదిక సభ్యులు సుదర్శనమ్మ, రామయ్య, కల్పన, సునీల్‌, డీవీ ప్రసాద్‌, పద్మజ, శ్రీదేవి, ప్రదీప్‌, ప్రవీణ, సునీత, శేఖర్‌, రఘురామయ్య, సుమలత, సురేంద్ర, నరసింహప్రసాద్‌ పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర



నెల్లూరు(బృందావనం): సాయి మాలధారణ మండల దీక్ష, శిరిడీ యాత్రను పురస్కరించుకుని భక్తులు ఆదివారం నగరంలో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. పద్మావతి నగర్‌లోని సాయిదర్బార్‌ అద్దాల మందిరం చైర్మన్‌ మధుసాయి ఆధ్వర్యంలో 300 మంది భక్తులతో శోభాయాత్ర చేశారు.

అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసాయి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి శోభాయాత్ర చేపడుతున్నట్లు వివరించారు.

గణనాథులకు పూజలు

• వైభవంగా నిమజ్జనోత్సవాలు

మనుబోలు: వినాయక చవితి సందర్భంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య విగ్రహాలకు గ్రామోత్సవాలు నిర్వహించి సమీపంలోని వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేస్తున్నారు. మనుబోలులోని వివిధ మండపాల్లో కొలువుదీర్చిన విగ్రహాలకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించి కమాల్‌ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.

• **ఇందుకూరుపేట:** గణేష్‌ ఉత్సవాల్లో ప్రధానమైన నిమజ్జన కార్యక్రమాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సెలవు కావడంతో జిల్లా నలుమూలల నుంచి వినాయకుని ప్రతిమలు పెద్ద ఎత్తులో తీరానికి చేరుకున్నాయి. సంప్రదాయం ప్రకారం నిమజ్జనం చేశారు.

• **బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌:** మండలంలోని పలు ప్రాంతాల్లో గణేషుని నిమజ్జన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. యువత ఉత్సాహంగా ఉట్టి మహోత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం వినాయక విగ్రహాలను సుందరంగా అలంకరించి, ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు. కాగులపాడు, దామరమడుగు, జొన్నవాడ వద్ద పెన్నానదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

• **కోవూరు:** కోవూరులోని ప్రభుత్వ జూనియర్‌ కాలేజీ వద్ద ప్రతిష్ఠించిన గణనాథుడి విగ్రహం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో లడ్డూ వేలం నిర్వహించగా ప్రవీణ్‌ బుక్స్‌ అండ్‌ ఫ్యాన్సీ దుకాణం యజమాని నాగసూరి ప్రవీణ్‌ రూ.1.70 లక్షలకు కైవసం చేసుకున్నారు.



మనుబోలు: పూజలందుకుంటున్న బొజ్జ గణపయ్య



ఇందుకూరుపేట: మైపాడు బీచ్‌లో గణనాథుని నిమజ్జనం



ఇందుకూరుపేట: మైపాడు బీచ్‌కు తరలివస్తున్న వినాయకుడు



కోవూరు ప్రభుత్వ జూనియర్‌ కాలేజీ వద్ద..



మనుబోలు: నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌: దామరమడుగు వద్ద..


స్కాన్‌ చేసేయ్‌.. పాఠాలు వినేయ్‌

- దీక్ష యాప్‌లో ఎన్సీఈఆర్టీ, స్టేట్‌సిలబస్‌లు
- అందుబాటులోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం
- ప్రతి పుస్తకంపై క్యూఆర్‌ కోడ్‌ ముద్రణ
- స్కాన్‌ చేస్తే సెల్‌ఫోన్‌ తెరపై పాఠ్యాంశాలు

సీతారామపురం: విద్యార్థులు అనారోగ్యంతో బడికి వెళ్లకున్నా, బడికెళ్లినా పాఠాలు సరిగా వినకున్నా, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు సరిగా అర్థం కాకున్నా విద్యార్థులు చదువులో వెనుకబడిపోతారు. అలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం దీక్ష యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అందులో ఎన్సీఈఆర్టీతోపాటు స్టేట్‌ సిలబస్‌ను పొందుపరిచింది. విద్యార్థులు సులువుగా పాఠ్యాంశాలను సెల్‌ఫోన్‌ ద్వారా చదువుకునేలా రూపకల్పన చేసింది.

క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేస్తే..

జిల్లాలో 2,517 పాఠశాలలతో పాటు 11 ఆదర్శ, 12 కస్తూర్బా విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 1.72 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి సరఫరా చేసిన అన్ని పాఠ్య పుస్తకాలపై క్యూఆర్‌ కోడ్‌ను ముద్రించారు. పాఠ్యాంశాలపై విద్యార్థులు పూర్తి పట్టు సాధించేలా వాటిని నిపుణుల ద్వారా దీక్ష యాప్‌లో పొందుపరిచారు. ఈ యాప్‌ను సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్‌ చేసుకుని పుస్తకాలపై ఉన్న క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేసి అర్థం కాని పాఠ్యాంశాన్ని సులువుగా చదివే వెసులుబాటు కల్పించారు. ఎన్సీఈఆర్టీ, స్టేట్‌ సిలబస్‌ పుస్తకాలను కూడా యాప్‌లో అందుబాటులో ఉంచారు. ఆడియో, వీడియో, క్విజ్‌, అసైన్మెంట్‌ సౌకర్యం కల్పించారు. ప్రత్యేకావసరాల పిల్లలకు ఆడియో పాఠాలు ఎంతో ఉపయోగపడుతాయి. నిఘంటువులో పదివేల పదాలున్నాయి.



క్యూఆర్‌ కోడ్‌తో ముద్రించిన పాఠ్య పుస్తకాలు



సెల్‌ఫోన్‌లో పాఠాలు వింటున్న విద్యార్థిని

యాప్‌ డౌన్‌లోడ్‌ ఇలా..

దీక్ష యాప్‌ను ప్లే స్టోర్‌ నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవాలి. ఆ తర్వాత అందులోకి వెళ్లి వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలపై ఉన్న క్యూఆర్‌ కోడ్‌ను సెల్‌ఫోన్‌తో స్కాన్‌ చేస్తే వెంటనే పాఠ్యాంశం తెరపై కనిపిస్తుంది.

బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి వినతి

నెల్లూరు(బృందావనం): జిల్లాలో బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘాల సమితి నేతలు విజయవాడలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్‌ చైర్మన్‌ బుచ్చి రామ్‌ప్రసాద్‌ను ఆదివారం కలిసి విన్నవించారు. గరుడ స్కీమ్‌ను పునరుద్ధరించాలని, తొలగించిన పెన్షన్లను పునరుద్ధరించాలని, అలాగే అర్హులైన బ్రాహ్మణులకు పెన్షన్లు ఇవ్వాలంటూ పలు సమస్యలపై వారు చర్చించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆ నేతలు తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వాసుదేవరావు, దుద్దుకూరు రమేష్‌బాబు, కోశాధికారి రామాయణం మణికుమార్‌, జిల్లా అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఉదయగిరి వెంకట శేషాచార్యులు, ఆదిశైవ అర్చక సంఘం ప్రధాన కార్యదర్శి గుడ్లూరు ఫణికుమార్‌శర్మ, ప్రేరేపి శ్రీనివాసశర్మ, జీవీ సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

